# కోరిక

మురారి సుబ్బారావు.

ఆఫీసుపనిమీద కాంప్‌లో ఉన్న ప్రసాదరావుకి భార్యకు ఒళ్ళంతా కాలి హాస్పటల్‌లో ఉందని టెలిగ్రామ్ వచ్చేసరికి వెంటనే బయలుదేరాడు.

భార్య గురించి ఆలోచిస్తుంటే భయంగా ఉంది ప్రసాదరావుకి. 'ఇప్పుడెలా ఉందో? ఎలా జరిగిందో ఏమిటో? వంటింట్లో జాగ్రత్తగానే తిరుగుతుంది. ఏమయ్యుంటుందో?' ఎంత ఆలోచించినా అర్థం కావడంలేదు ప్రసాదరావుకి.

లక్ష్మి,ప్రసాదరావుల పెళ్ళయి ఏడాది కావస్తూంది. పెళ్ళయి లక్ష్మి కాపురాని కొచ్చిన నాటినుండి జరిగిన సంఘటనలు గుర్తుకు వస్తున్నాయి ప్రసాదరావుకి.


లక్ష్మి ఉన్నంతలో పొదుపుగా ఖర్చు చేసి సంసారం గడపాలనే తత్త్వం కలది. లక్ష్మి అత్తగారు, మొగుడొదిలేస్తే పుట్టింటి కొచ్చి వడ్డ ఆడపడుచు మహా దుబారా మనుషులు. చూసిందల్లా కొనాలంటారు. వచ్చిన సినిమాకు వెళ్ళాలంటారు. ఉదయం లేస్తూనే కాఫీ పడకపోతే బతకలేని వాళ్ళలాగ రోజు కో సినిమా చూడందే బతకలేరు. అంత పెద్ద వయసొచ్చినా యౌవనవతిలా కనిపించడానికి అత్తగారు చేసుకునే పోకులకు, భర్త దగ్గరకు ఏదో రకంగా వెళ్ళిపోదామనే ధ్యాస లేని ఆడపడుచు సింగారాలకు మరింత ఖర్చు.


ఆర్థికంగా ప్రసాదరావు స్థాయికన్నా కొంచెం తక్కువ స్థితి నుంచి వచ్చింది లక్ష్మి. అందువల్ల తన పొదుపరితనంతో లక్ష్మి పెట్టే అడ్డంకులు తలనొప్పి కలిగిస్తున్నాయి అత్తగారికీ,ఆడపడుచుకీ. పైగా లక్ష్మి తండ్రి ఇవ్వాల్సిన బాకీ కొంత ఉంది. అలకపాన్పు సమయంలో కొనిస్తానన్న టి.వి ఇంకా ఇవ్వనే లేదు. లక్ష్మిని ఇబ్బందుల్లో పడేయడానికి, సూటిపోటి మాటలనడానికి ఇవి తోడయ్యాయి వాళ్ళకి.

మొన్న ఆషాఢమాసానికి పుట్టింటికి పంపిస్తూ టి.వి. పట్టుకురమ్మని మరీ మరీ చెప్పింది ప్రసాదరావు తల్లి. సరేనని తలూపి వెళ్ళింది లక్ష్మి. తీరా తిరిగి వస్తూ టి.వి. తీసుకు రాలేదుసరికదా,పెళ్ళికి తండ్రి కొన్న చీరల్లో ఒక చీర కావాలని చెల్లెలు అడిగిందని ఇచ్చి వచ్చేసింది లక్ష్మి. అది మరింత కంటగింపు అయింది లక్ష్మి అత్తగారికి.'ఆ ఇంటినుంచి ఏమీ లేకపోగా ఉన్నవి ఇచ్చి వస్తావా' అంటూ కోపోద్రిక్తులయ్యారు అత్తగారు, ఆడపడుచు. లక్ష్మిని అనరాని మాటలన్నారు. 'ఈ రోజున నువ్వు భోజనం కాదుగదా వచ్చి మంచినీళ్ళయినా తాగడానికి వీల్లేదంటూ వంటింటి తలుపులు తాళం వేసుకుని సినిమాకు పోయారు. ఆ రోజంతా పస్తు పడుకుంది లక్ష్మి.అత్తా కోడళ్ళ మధ్య మరీ గొడవ ప్రారంభమైంది ఆ రోజునుంచి.

ఇంట్లో జరుగుతున్న విషయాలన్నీ భర్తతో చెప్పేది లక్ష్మి. తన తల్లి,అక్క ఇలా చేస్తున్నారంటే బాధ పడేవాడు ప్రసాదరావు. కానీ తరువాత తల్లి ప్రసాదరావుతో చెప్పే విషయాలు మరొకలా ఉండేవి. లక్ష్మిదే తప్పు అన్నట్లు తల్లి చెప్పేది.ఎవరు చెప్పేది నమ్మాలో తోచేది కాదు ప్రసాదరావుకి. విని విని విసుగొచ్చి'ఇక మీరెవరూ నాతో ఏమీ చెప్పవద్దని అందర్నీ కసిరేశాడు. దాంతో ఏ విషయమూ భర్తతో చెప్పుకుందుకి కూడా వీల్లేకుండా పోయింది లక్ష్మికి.

వారం రోజుల క్రితం"పుట్టింటికి వెళ్ళి డబ్బయినా పట్రా,మరేదయినా పట్రా"మన్నది అత్తగారు. దాని విషయంగా మాట పెరగటంతో లక్ష్మిని వాళ్ళిద్దరూ కొట్టారు. ప్రసాదరావుతో చెప్పుకుని ఏడ్చింది లక్ష్మి. ప్రసాదరావు విని మౌనంగా ఉండిపోయాడు. ఇలాగే నాలుగైదు సార్లు జరిగింది. 'నిన్ను పీకపిసికి చంపేస్తే మరింత కట్నంతో మరొకర్తొస్తుందే' అని రెండు మూడు సార్లంది అత్తగారు. ఒంటిమీద పడ్డ వాతలుకూడా చూపించింది భర్తకులక్ష్మి ఒక రోజున. 'ఏమిటమ్మా ఇది' అనడిగాడు తల్లిని. దాని కావిడ మరింత మండిపడింది. కోడలు ఎదురుగానే కొడుకును తిట్టి పోసింది. పెళ్ళాన్ని అదు






మీ యింటికెవరైనా రాగానే, గడపతొక్కి లోపలికి రాగానే, మీ అతిథులకి మీరు చేసే సత్కారం ఏమిటి? ఓ చిరునవ్వు, ఓ కప్పు టీ—అవునా? మరి పరంపరాగతంగా వస్తూన్నదది—మీ సంప్రదాయం, సంస్కృతి, ఆదరణ-వీటి చక్కని పరిణామ స్వరూపం.

మరి వాళ్ళొచ్చేసరికల్లా మీ యింట్లో పాలు అయిపోయాయనుకోండి. మీకెలాగో యిబ్బందిగా అనిపించదూ? ఇక అప్పుడి కప్పుడు ఉన్న పళంగా పాలు రమ్మంటే ఎలా వస్తాయి గనక?

సాగర్ స్కిమ్ మిల్క్ పౌడర్, మరి మీ అమ్మగారి, అమ్మమ్మగారి నుంచీ తరతరాలుగా వస్తూన్న ఆ చక్కని సంప్రదాయాన్ని నిలబెడుతుందిక. అది కూడా పొదుపుగా, త్వరగా, తేలికగా. ఇక తీపి పదార్థాలూ, పుడ్డింగులూ అవీ చేసుకోవడానికి యిదెంతో బాగుంటుంది.

ASP/SMP/5/84




# సాగర్
## స్కిమ్ మిల్క్ పౌడర్

**పాలలోని మంచిదనాన్నంతా యిస్తుంది, కొవ్వు పదార్థాలు లేకుండానే.**

మార్కెట్ చేసేవారు:
గుజరాత్ కోపరేటివ్ మిల్క్ మార్కెటింగ్ ఫెడరేషన్ లిమిటెడ్
పోస్ట్ బాక్స్ 10, ఆనంద్ 388 001. గుజరాత్.

పులో పెట్టలేని దద్దమ్మ వంది. అన్ని మాటలకు,అవమానాలకు సహిస్తాడేమో కాని పెళ్ళాన్ని అదుపులో పెట్టలేని దద్దమ్మ వంటే మాత్రం చేతకానితనానికి అవమానం తోడైన ఉక్రోషం కలుగుతుందేమో మగాడికి. ప్రసాదరావుకి మాత్రం పిచ్చి కోపం వచ్చింది. 'నీ మాటలు నమ్మినందుకు నేను వెధవ నయ్యానంటూ లక్ష్మీమీద విరుచుకు పడ్డాడు ప్రసాదరావు.

ఇది జరిగి నాలుగు రోజులైంది. ఆఫీసు పనిమీద కాంప్ కెళ్ళాడు ప్రసాదరావు. ఇంతలో ఇలా ఘోరమైన వార్తతో టెలిగ్రామ్...వెంటనే బయలుదేరాడు.

బస్సు దిగుతూనే హాస్పటల్‌కి బయలుదేరాడు ప్రసాదరావు.

బెడ్‌మీద లక్ష్మి శరీరం చాలా వికృతంగా ఉంది. నల్లగా మాడిపోయి, చర్మం చిట్లిపోయింది. ముఖం పూర్తిగా కమిలిపోయి అసహ్యంగా తయారయింది. దగ్గర నిలబడితే శరీరం లోంచి ఏదో ఉడుకు వాసనొస్తూంది.

చుట్టూ చూశాడు. తల్లి,అక్క బయట నిలబడి ఉన్నారు. పక్కింటి విశ్వనాథం మాష్టారు అప్పుడే వచ్చారు లక్ష్మి తండ్రిని వెంట బెట్టుకుని ఆయన దగ్గరకు వెళ్ళాడు ప్రసాదరావు.

"ఏం జరిగిం దసలు?" ఆత్రుతగా అడిగాడు.

వసాదరావు వైపు అసహ్యించుకున్నట్లు చూశారు విశ్వనాథం మాష్టారు."ఏం జరిగిందనా ఏం జరుగుతుందనా? ఏ విషయం కావాలి,బాబూ,నీకు?" వ్యంగ్యంగా అడిగారు విశ్వనాథంగారు.

"క్షమించండి. మాటలతో చంపకండి. ఏం జరిగిందో చెప్పండి దయచేసి" అన్నాడు ప్రసాదరావు.

"రోజూ మీ ఇంట్లో గొడవలు జరుగుతున్నాయి అత్తా,కోడళ్ళ మధ్య. ఆ విషయాలు నీకు తెలుస్తున్నా నువ్వు పట్టించుకోలేదు.' నాకెందుకులే'అన్నట్లు మౌనంగా ఉండిపోయావు. పెళ్ళాం కావాలి కానీ,నువ్వు ఇంట్లో లేనప్పుడు అది ఏ అవస్థలు పడుతోందో నీకక్కరలేదు. పెళ్ళాం మంచి చెడ్డలు కట్టుకున్న మొగుడికి లేనప్పుడు అత్తకీ, ఆడపడుచుకీ మరీ చులకన! అందుకే మీ అమ్మా, అక్కా లక్ష్మిని తిట్టారు,కొట్టారు. అయినా సహించింది. ఈ ఉదయం ఏం జరిగిందో తెలుసా?మీ చిన బావమరిది ఈ ఊళ్ళో ఎన్.సి.సి. కాంప్‌కి వచ్చాట్ట.అక్కను చూసి పోదామని వచ్చాడు. ఆ సమయంలో లక్ష్మిబాత్రూమ్‌లో స్నానం చేస్తూంది. లక్ష్మి స్నానం చేసి వచ్చి మీ బావమరిదితో మాట్లాడ్డం మీ అమ్మకు ఇష్టం లేనట్లుంది. అందుకని ఏం చేసిందో తెలుసా? స్నానం చేసి కట్టుకుందుకి బాత్రూమ్ తలుపుమీద వేసిన బట్టలు, స్నానం చేయడానికని విప్పిన బట్టలు అన్నీ బాత్రూమ్ తలుపు మీంచి తీసేసిందట మీ అక్క. బట్ట ల్లేకుండా మీ ఆవిడ బయటి కెలా వస్తుంది? నాలుగైదు కుటుంబాలున్న ఇల్లు కూడాను. లక్ష్మి బాత్రూమ్‌లోనే ఏడుస్తూ ఉండిపోయింది. మీ బావమరిది చాలా సేపు కూర్చున్నాట్ట. పైగా 'నీతో మాట్లాడ్డం మీ అక్కకు ఇష్టం లే'దంటూ మీ అమ్మ ఆ అబ్బాయితో చెప్పిందట. ఆ అబ్బాయి ఏడుపు మొహంతో వెళ్ళిపోయాడు. మీ అమ్మ,అక్క మహా సంతోషపడ్డారు. 'మీ తమ్ముడితో నువ్వు మాట్లాడకూడదనే నీ బట్టలు తీసేసి బాత్రూమ్‌లోంచి నువ్వు రాకుండా చేశామే'అందిట మీ అక్క. లక్ష్మి ఎంత బాధ పడిందో! ఏం ఆలోచన వచ్చిందో మరి! బాత్రూమ్ లోంచి గబగబా వంటింట్లోకి పరిగెత్తుకుపోయి తలుపులు వేసుకుంది. కిరసనాయిలు ఒంటిమీద పోసుకుని నిప్పంటించుకుందిట." చెప్పారు విశ్వనాథంగారు.

ఆ మాటలకు చలించి పోయాడు ప్రసాదరావు.

"ఇంత ఘోరం జరుగుతుం దనుకోలేదు, మాష్టారూ" అన్నాడు బాధగా.

"కానీ,మేం అనుకున్నామోయ్. మీ ఇంట్లో విషయాలు పక్క వాటాలో ఉన్న మాకు ఎప్పుడూ వినపడుతూ ఉంటాయి. కానీ,ఆ ఇంట్లో వాడివి నీ చెవిన పడక పోవటం వింతగా ఉంది. చూడు, బాబూ. . . భర్త అనేవాడు గోడకు కొట్టిన మేకులా ఉన్నాడనుకో. సుత్తి దెబ్బలు పడుతూనే ఉంటాయి. గోడకు వేసిన సున్నంలా ఉన్నా డనుకో. ఆ గోడకు జేరగిలబడా లనుకునే వాళ్ళ ఒంటికి తెల్లటి సున్నం అంటుకుంటుంది. అందుకని కొంచెం దూరంగా ఉంటారు. భర్త అలా ఉండాలి. ఇవన్నీ నీకు తెలియనివి కావు. ఆలోచించు...ఇకముందయినా పెళ్ళాం విషయం కాస్త ఒంటబట్టించుకో"అన్నారు విశ్వనాథంగారు.

మర్నాడు ఉదయానికల్లా స్పృహవచ్చింది లక్ష్మికి. ఒంట్లో కాస్త కదలిక అయితే ఉంది కాని,ఊపిరి పీల్చడంకూడా కష్టంగానే ఉంది. నరనరాల్లోంచి సలుపు,పోటు. . . నెమ్మదిగా కూడదీసుకుని మాట్లాడింది.

పోలీసు విచారణలో...ప్రమాదం ఊహించని విధంగా జరిగిందని,వంటింట్లో అటక మీంచి ముగ్గు డబ్బా తీస్తుంటే పక్కనున్న కిరసనాయిలు సీసా దొర్లి మీద పడి ఒంటినిండా కిరసనాయిలు ఒలికిందని, ఆ సమయంలో పక్కనే ఉన్న స్టౌ మండుతూందని-ఆ రకంగా ప్రమాదం జరిగిందని,అత్తగారు తన నెంతో ప్రేమగా చూసేదని, తామిద్దరి మధ్యా ఏ గొడవలు లేవని,అవన్నీ అందరూ కల్పించి చెప్పినవేనని తెలియజేసింది.

పోలీసు విచారణ పూర్తి అయ్యాక భర్తను దగ్గరకు పిలిచింది లక్ష్మి. "మీ మీద నాకెలాంటి ద్వేషం లేదు. మీరంటే పిచ్చి ప్రేమ. నా మీద మీకు అభిమాన ముందని తెలుసు. కానీ,కొత్తగా వచ్చిన నా మాట వినాలో,తల్లి మాట వినాలో నిర్ణయించుకోలేక తల్లడిల్లిపోయారు. ఏమండీ! నా దొక్క కోరిక తీరుస్తారా?" అడిగింది లక్ష్మి.

"ఏమి టది?" అడిగాడు ప్రసాదరావు.

"తీరుస్తానని మాటివ్వండి."

"దేవుడిమీద ఒట్టు. ఏం చెయ్యమంటావో చెప్పు."

"నేను. . . నేను చచ్చిపోయాక నన్ను అసహ్యించుకోకుండా పెదవులమీద అత్తగారు..."లక్ష్మి మాటలు పూర్తి చేయడానికి విశ్వప్రయత్నం చేస్తోంది.

"అత్తగారి చేత నా పెదవులమీద ఒక ముద్దు పెట్టించండి."

ఆ కోరికకు ఒళ్ళు జలదరించింది. లక్ష్మి ముఖం వైపు చూశాడు. అప్పటికే ఆమె ఊపిరి ఆగిపోయింది. కళ్ళు నిశ్చలంగా శూన్యం వైపు చూస్తున్నాయి. కళ్ళు చెమ్మగిల్లాయి ప్రసాదరావుకి.

అమృతధారలు కురిపించే పెదవులు నల్లగా మాడిపోయాయి. బాగా ఉబ్బిపోయాయి. ఒక పక్కగా మాంసం ముద్ద కనబడుతూంది. నీళ్ళు కలిసిన రక్తంలాగ పెదవుల్లోంచి ఏదో రసి కారుతూంది.

అత్తగారు దగ్గిరి కొచ్చింది. తప్పులేదు. .తప్పదు కూడా!ఒక్క క్షణం కళ్ళు మూసుకుని ఆ పెదవులమీద ముద్దు పెట్టుకుంది అత్తగారు. మరు క్షణం బావురుమని ఏడేసింది.

ఆ ముద్దులో శవాన్ని పీక్కు తింటున్న రుచి కలిగింది అత్తగారికి. ఆ ముద్దు 'ఆడది' అంటే ఏమిటో తెలిసేలా చేసిందిఅత్తగారికి. ఆ ముద్దులో నరకయాతన అనుభవించిన ఆ హృదయపు కన్నీళ్ళ రసి తగిలింది ఆడపడుచుకి. ఆ ముద్దు నెత్తుటిని చల్లబరిచింది ఆడపడుచుకి. ఆ ముద్దు జీవితంపట్ల అసహ్యాన్ని కలిగించింది ప్రసాదరావుకి. ఆ ముద్దు యవ్వనాన్ని,ఉద్రేకాన్ని,కోరికని... చంపేసింది ప్రసాదరావుకి. ఆ ముద్దు తల్లిని,అక్కనిఅసహ్యించుకునేలా చేసింది.

'లక్ష్మీ! క్షమించు. నీకు చాలా అన్యాయం చేశాను'!మౌనంగా రోదించాడు ప్రసాదరావు.

ఆ మాటకు లక్ష్మి చిరునవ్వు నవ్వినట్లనిపించినది ప్రసాదరావుకి.

'నాకు తెలుసనండీ. ఇలా ముద్దు పెడితే ఈ సంఘటన మీ రెప్పుడూ మరిచిపోలేరు. అనుక్షణం ఇదే గుర్తుకు వస్తుంది. బాధతో విలవిల్లాడి పోతారు. అదే నాకు కావలసింది. మీరు మళ్ళీ పెళ్ళి చేసుకుంటారు. ఆ వచ్చేది నాలాగే అత్తగారి చేత రంపపుకోత అనుభవిస్తుంది.మనోనిబ్బరం లేనిదైతే నా లాగే చస్తుంది. అలా జరగకుండా ఉండడానికి. మరో ఆడపిల్లకు అన్యాయం చేయాలనే భావన వస్తే భయపడి పిరికివాళ్ళై పోవాలని,తద్వారా నా లాంటి ఆడపిల్ల రక్షించ బడాలనే కోరికతోనే మిమ్మల్ని ఆ కోరిక కోరాను.'లక్ష్మి శాశ్వత నిద్ర పోతూంది,తృప్తిచెందినటుగా! ★